క్లుప్తంగా

క్యాంపెయిన్ కమిటీ జిల్లా కార్యదర్శిగా గణేశ్


నియామక పత్రం అందిస్తున్న వెంకటేష్‌గౌడ్

చిట్యాల: పట్టణానికి చెందిన గంగారపు గణేశ్ కాంగ్రెస్ పార్టీ క్యాంపెయిన్ కమిటీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. కమిటీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పాలగోని వెంకటేష్‌గౌడ్ సోమవారం గణేశ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, క్యాంపెయిన్ కమిటీ కో ఆర్డినేటర్ వనమాల రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అన్నదానం

నకిరేకల్ : లయన్స్ క్లబ్, నవ్య క్లబ్ ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని ఏరియా ఆస్పత్రిలో మంగళవారం ఉదయం 8.30 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్‌ల అధ్యక్షులు బి.ప్రకాష్‌రావు, రమదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీను

కట్టంగూర్ : సైబర్ క్రైమ్‌పై ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలని కట్టంగూర్ ఎస్‌ఐ ఎన్ శ్రీను సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ క్రైమ్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల ప్రతి ఒక్కరికీ స్పామ్ కాల్స్ వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వొద్దన్నారు. ఎస్‌ఎంఎస్ రూపంలో వచ్చిన లింక్‌లను ఓపెన్ చేసి మోసపోవద్దన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ నంబర్‌లను ఎవరికీ చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది వెంకన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాచకొండ శివాలయంలో ప్రత్యేక పూజలు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని రాచకొండ స్వయం శంభులింగేశ్వర దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జల, క్షీరా అభిషేకాలు నిర్వహించినారు. అనంతరం రాచప్ప సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో శరత్ చంద్ర, రాచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణ కుమార్, కేశట్టి ధశరథ, రాజురెడ్డి, కమల్, మారయ్య తదితరలున్నారు.

సీపీఎం నాయకుల అరెస్ట్

శాలిగౌరారం: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మంగళవారం జరగనున్న గ్రామపంచాయతీ కార్మికుల ధర్నాలో పాల్గొనకుండా స్థానిక సీపీఎం నాయకులను పోలీసులు సోమవారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని పోలీసులు తెలిపినట్లు సీపీఎం నాయకులు పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో సీపీఎం మండల నాయకులు కల్లూరి లింగయ్య, మక్క బుచ్చిరాములు, గుండ్లపల్లి వెంకన్న తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

మిర్యాలగూడ అర్బన్ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ సీఐ నాగార్జున అన్నారు. సోమవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే పది మందిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు మద్యం వల్ల కలిగే నష్టాలు వారికి వివరించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించినా, రాత్రి సమయంలో రోడ్లపై మద్యం మత్తులో హల్‌చల్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే స్థానికులు గుర్తించి డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు కృష్ణయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ నాగార్జున

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్ !

- నకిరేకల్ పట్టణానికి కిలోమీటర్ దూరంలో నిర్మాణం
- మెయిన్ సెంటర్ నుంచే రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు
- చౌరస్తాలో మినీ బస్టాండ్ నిర్మించాలని వేడుకోలు


నకిరేకల్ బస్టాండ్


నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

నకిరేకల్ : నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్‌లో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. మెయిన్ సెంటర్‌కు ఒక కిలోమీటర్ దూరంలో అన్ని హంగులతో ఆర్టీసీ బస్టాండ్ ఉన్నప్పటికీ అందులోకి ప్రయాణికులు ఎవ్వరూ వెళ్లడం లేదు. ప్రయాణికులు ఈ బస్టాండ్‌లోకి వెళ్లనప్పటికీ ఇటీవల ఆర్టీసీ బస్సులు నామమాత్రంగా వచ్చి వెళుతున్నాయి. ప్రస్తుతం మెయిన్ సెంటర్ నుంచి ప్రయాణికులంతా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో మెయిన్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

చౌరస్తాలో ప్రయాణికుల రద్దీ

నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా మెయిన్ సెంటరే ప్రయాణికుల రాకపోకలకు పెద్ద దిక్కయింది. ఇక్కడి నుంచి ప్రతి నిత్యం హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, మధిర, సూర్యాపేట, కోదాడ, నల్లగొండ, మిర్యాలగూడెం, తుంగతుర్తి, మోత్కురు వైపు ప్రయాణికులు వెళుతుంటారు. ప్రస్తుతం సూర్యాపేట వైపు వెళ్లే ప్రయాణికులంతా స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్ ముందున్న ఖాళీ స్థలంలో.. హైదరాబాద్ వైపు వెళ్లే వారంతా ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద.. తిప్పర్తి, నల్లగొండ రోడ్డు మూలమలుపుల వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. మెయిన్ సెంటర్‌లో ఉన్న పాత ఆర్అండ్‌బీ బంగ్లా ప్రాంతంతోపాటు, పాత సమితి కార్యాలయ స్థలం ఎంపిక చేసి మినీ ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. మెయిన్ సెంటర్‌లో మినీ ఆర్టీసీ బస్టాండ్ నిర్మిస్తే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంతోపాటు మెయిన్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందని ప్రజలు, ప్రయాణికులు అభిప్రాపడుతున్నారు.

పట్టణంలోకి బస్సులు రావడం లేదు



నకిరేకల్ మెయిన్ సెంటర్ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మిస్తే బాగుంటుంది. ఇక్కడి నుంచి వెళ్లే ప్రయాణికులు రహదారిపై నిలబడడంతో ఒక్కోసారి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులు పట్టణం లోపలికి రాకుండా బైపాస్ నుంచి వెళ్లిపోతున్నాయి పాత రహదారి బంగ్లా స్థానంలో మినీ బస్టాండ్ నిర్మిస్తే అందరి ఎంతో ప్రయోజనం ఉంటుంది.

-యాసా కరుణాకర్‌రెడ్డి, నకిరేకల్

ప్రయాణికులు బస్టాండ్‌లోకి రావడం లేదు



నకిరేకల్‌లోని ఆర్టీసీ బస్టాండ్ మెయిన్ సెంటర్‌కు దూరంగా ఉన్నందున ప్రయాణికులు అందులోకి రావడం లేదు. ఎక్కడ చేయి లేపితే అక్కడే బస్ ఆపుతున్నాం. ప్రయాణికులు బస్టాండ్‌కు వెళ్లాలంటే లోకల్ ఆటోలో రావాల్సి వస్తోంది. దీంతో అదనంగా ఆటో కిరాయి భరించాల్సి వస్తోంది. మెయిన్ సెంటర్‌లోని పాత రహదారి బంగ్లా స్థలంలో మినీ బస్టాండ్ నిర్మిస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది.

-మన్నాన్, ఆర్టీసీ కంట్రోలర్, నకిరేకల్

పోలీస్ అమరుడు నాగరాజుకు నివాళి


నాగరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : సిమి ఉగ్రవాదుల దాడిలో అమరుడైన పోలీసు కానిస్టేబుల్ చెవుగోని నాగరాజు 41వ జయంతి వేడుకలను కుటుంబ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయిటిపాముల గ్రామంలో ఏర్పాటు చేసిన నాగరాజు విగ్రహానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని పందెనపల్లి గ్రామానికి చెందిన గజ్జి వీరయ్య అనారోగ్యంతో మృతిచెందగా ఆయన మృతదేహంపై ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, బెజవాడ సైదులు, మర్రి రాజు, అంజన్‌కుమార్, వీరస్వామి, లింగయ్య ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి..

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెరుమాళ్ల వెంకటయ్య చిత్రపటం వద్ద సోమవారం కాంగ్రెస్ నేత దైద రవీందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న ఏరెట్ల శ్రీనివాస్‌రెడ్డి

మర్రిగూడ: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏరెట్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. డిండి ఎత్తిపోతల పథకం, కిష్టరాంపల్లి, శివన్నగూడ రిజర్వాయర్ వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ, బీటీ రోడ్లు వేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపొందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పి.రాజేంద్రనాయక్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి యాస అమరేందర్‌రెడ్డి, బోయపల్లి రాజుగౌడ్, నాయకులు లింగస్వామి, భాస్కర్‌నాయక్, వేనేపల్లి శ్రీనివాస్‌రావు, వెంకటంపేట శేఖర్, దేవేందర్, అంబాల రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కొందరికే గ్యాస్ సబ్సిడీ

- మునుగోడు మండలంలో 70శాతం అర్హులకు జమకాని సబ్సిడీ డబ్బులు
- అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం


మునుగోడు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు ఇస్తున్న ప్రజలు (ఫైల్)

మునుగోడు: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన వంట గ్యాస్ సబ్సిడీ అనేక మంది లబ్ధిదారులకు అందడం లేదు. సబ్సిడీ ఖాతాల్లో జమ కావడం లేదని అర్హులు మునుగోడు ఎంపీడీఓ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చూయిస్తుందని, కానీ డబ్బులు ఎందుకు జమ కావడం లేదో తమకు తెలియయదని ఆ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. గ్యాస్ సబ్సిడీకి ఎవరిని కలవాలో తమకు అర్థం కావడం లేదో తమకు తెలియదని అర్హులు వాపోతున్నారు.

మండల వ్యాప్తంగా 13,127 అర్హులు..

మునుగోడు మండలంలోని 26 గ్రామాల్లో దాదాపు 24వేల కుటుంబాలు ఉండగా అందులో 13,127 కుటుంబాలకు తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నారు. అయితే అందులో దాదపు 9వేల కుటుంబాలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సబ్సిడీ మాత్రం కొందరికి మాత్రమే వస్తుందని, తమకు సబ్సిడీ రావడం లేదని దాదాపు 70 శాతం మంది ఎంపీడీఓ కార్యాలయం వద్దకు వచ్చి అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే గ్యాస్ సబ్సిడీ ప్రకటించిందని, క్షేత్రస్థాయిలో అమలుచేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అర్హులందరికీ సబ్సిడీ అందేలా చూడాలని కోరుతున్నారు.

రూ.46 మాత్రమే జమ అవుతోంది



నాకు తెల్లరేషన్‌కార్డు ఉంది. ప్రజాపాలనలో ఉచిత కరెంట్ బిల్లు, వంట గ్యాస్ సబ్సిడీ ఇవ్వాలని ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చినా. కరెంట్ బిల్లు మాఫీ అవుతోంది. కానీ వంట గ్యాస్ సబ్సిడీ మాత్రం గతంలో వలె రూ.46 మాత్రమే వస్తోంది. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను అడిగితే తెలియదు అంటున్నారు. ఎంపీడీఓ కార్యాలయానికి వస్తే కూడా అదే సమాధానం వస్తోంది.

– జి.రాజు, గంగోరిగూడెం

పొజిషన్ పట్టాలు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: సాగర్ రోడ్డులోని ముత్యాలమ్మ కాలనీలోగల ప్రభుత్వ భూమిలో గృహాలు నిర్మించుకున్న వారికి పొజిషన్ పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నల్లగొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కొందరికే జీఓ నంబర్ 58, 59 ప్రకారం పట్టాలు ఇచ్చారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో విజయ, విశ్వనాథుల లెనిన్, సుజాత, కౌసల్య, ముస్రత్‌బేగం, సైదమ్మ, మాధవి, శంకరమ్మ, రేణుక, కుమారి, రాములమ్మ, హైమావతి, రంగమ్మ, గిరయ్య, నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీ.నారాయణరెడ్డికి ఘన నివాళి


బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

నల్లగొండ టూటౌన్ : డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) 93వ జయంతి వేడుకలను రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం నల్లగొండలో ఘనంగా నిర్వహించారు. సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణరెడ్డి రాసిన సినీ పాటల పోటీల్లో 22 మంది గాయకులు పాల్గొని పాటలు పాడారు. ప్రతిభ కనబర్చిన మారోజు కేశవాచారికి మొదటి బహుమతి, తాడూరి రమేష్‌కు ద్వితీయ బహుమతి, మాచర్ల మహేశ్వర్‌కు తృతీయ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నల్లగొండ మండల అధ్యక్షుడు గజవెల్లి సత్యం, కార్యదర్శి యాద వాసుదేవ్, జెల్లా పుల్లయ్య, రవి ప్రసాద్, వెంగళరావు, చొల్లేటి ప్రభాకర్, ప్రకాశ్, గోపాల్‌రెడ్డి, కవులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

మర్రిగూడ : గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. బీసీ కులగణన చేపట్టిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. ఇప్పుడు కులగణన చేపట్టకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవడం సరికాదన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం


నల్లగొండ టూటౌన్ : చెక్కు అందిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి


చెక్కు అందిస్తున్న కౌన్సిలర్ కరుణాకర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అనారోగ్య కారణాలతో వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 112 మంది నిరుపేద ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.36,26,500 విలువ గల చెక్కులను సోమవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో గుత్తా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ద్వారా లక్షలాది మంది పేదలకు సహాయం అందుతోందన్నారు. యామ దయాకర్, పసల శౌరయ్య ఐతగాని స్వామిగౌడ్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ఆరో వార్డు పరిధి శాంతినగర్‌కు చెందిన జియాబున్నీసాబేగం, ఎం.రాజ్యలక్ష్మికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.31,500, రూ.60 వేల విలువ గల చెక్కులను సోమవారం 6వ వార్డు కౌన్సిలర్ కర్నాటి కరుణాకర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం సహాయ నిధి మంజూరు చేయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, కౌన్సిలర్ కరుణాకర్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రుణమాఫీ కాలేదని రైతుల ఆందోళన


బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న రైతులు

మర్రిగూడ : రుణమాఫీ తమకు పూర్తి స్థాయిలో కాలేదని ఆరోపిస్తూ మండలానికి చెందిన పలువురు రైతులు సోమవారం మండల కేంద్రంలోని సహకార పరపతి బ్యాంక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ బ్యాంక్ సిబ్బంది నిర్లక్ష్య ధోరణి కారణంగానే తమకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో బ్యాంక్ సిబ్బంది సమయానికి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయని కారణంగానే ఇలా జరిగిందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని త్వరలో రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి, యాదయ్య, అంజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న మేరు సంఘం నాయకులు

నల్లగొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మేరు సహకార సొసైటీకి రూ.50 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం గడియారం సెంటర్‌లో పట్టణ మేరు సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మేరు సంఘం పట్టణ అధ్యక్షుడు నామ రాంప్రసాద్, రామకృష్ణ, రాపర్తి వెంకన్న, కిరణ్‌కుమార్, నర్సింహ, శ్రీనివాస్, ప్రకాష్, భద్రయ్య, కిషన్, రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న వంటెపాక కృష్ణ

నకిరేకల్ : ప్రభుత్వ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ కోరారు. నకిరేకల్‌లోని వివిధ ప్రభుత్వ వసతి గృహాల్లో సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో వసతులపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చాలా వరకు ప్రభుత్వ వసతి గృహాలు అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ నడుస్తున్నాయన్నారు. సరైన వసతి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతూ చదువులు సాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు వంటెపాక వెంకటేశ్వర్లు, సుధీర్, ఏర్పుల నరేష్, వి.నాగార్జున పాల్గొన్నారు.

గుంతలమయంగా పిట్టంపల్లి రోడ్డు


పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

చిట్యాల: ఇటీవల వరుసగా కురిసిన వర్షానికి చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు చిత్తడిగా మారింది. జాతీయ రహదారి నుంచి పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిలిచి గుంతలమయంగా మారింది. దీనితోడు సమీప పరిశ్రమకు చెందిన భారీ వాహనాలు ఈ రోడ్డు మీదుగా వెళుతుండడంతో రోడ్డంతా గుంతలు, బురదమయంగా మారి పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు తగిన మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

తల్లిదండ్రుల తీరు మారాలి

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయుల పట్ల విద్యార్థుల తల్లిదండ్రుల తీరు మారాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మారం శ్రీనివాస్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ కోరారు. సోమవారం స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులు చేస్తున్న తప్పిదాలు సరి చేయాల్సిన తల్లిదండ్రులు పట్టించుకోకపోగా సరి చేసే క్రమంలో ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల వేషధారణ, వ్యవహారశైలి ఉపాధ్యాయులను ఆందోళన కలిగిస్తోందన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు శిరీషను సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రెండు నెలల నుంచి హెయిర్ కటింగ్ విషయంలో హెచ్చరిస్తున్నా అటు తల్లిదండ్రులు, ఇటు విద్యార్థులు పెడచెవిన పెట్టారన్నారు. ఈ సమావేశంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య, సురేందర్‌రెడ్డి, ముత్యాలు, మక్లానాయక్, జయరాజు తదితరులున్నారు.


మానవాళి అభివృద్ధిలో చెట్లు కీలకం

మిర్యాలగూడ అర్బన్ : మానవాళి అభివృద్ధిలో చెట్లు ఎంతో కీలకమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఛేంజ్ మేకర్ పట్టణ అధ్యక్షుడు దొడ్డా శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. సంస్థ సభ్యులు మాధవి, సైదులు, గార్లపాటి పద్మ, కందుకూరి గీత, పల్‌రెడ్డి కళావతి, సాయి, విశిష్ట, స్వాతీ, స్వర్ణలత, కేశిరెడ్డి శ్రవంతి, లక్ష్మమ్మ, స్వప్న, ఉషాశర్మ తదితరులున్నారు.


మొక్క నాటుతున్న సంస్థ సభ్యులు

విస్తరిస్తున్న నకిరేకల్ పట్టణం

- వివిధ అవసరాల నిమిత్తం వలస వస్తున్న ప్రజలు
- ప్లాట్ల ధరలకు రెక్కలు


నకిరేకల్ పట్టణం వ్యూ

నకిరేకల్ : మూడు జాతీయ రహదారులను కలుపుతూ కూడలిగా ఉన్న నకిరేకల్ పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. నాలుగేళ్ల క్రితం నకిరేకల్ పట్టణం మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన విషయం విదితమే. నకిరేకల్ పట్టణాన్ని తాకుతూ 65 నంబర్ జాతీయ రహదారితోపాటు 365 సిరొంచ, 565 రేణికుంట జాతీయ రహదారులు వెళుతున్నాయి. పట్టణం చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు చేయడంతో ధరలు గతం కంటే రెట్టింపులో పలుకుతున్నాయి.

40 వేలు దాటిన జనాభా

నకిరేకల్‌కు నాలుగు వైపులా అపార్ట్‌మెంట్‌లు వెలుస్తుండడంతో జనాభా కూడా రెట్టింపు అవుతోంది. నకిరేకల్ మున్సిపాలిటీలో 2011 జనాభా లెక్కల ప్రకారం 29,126 మంది జనాభా ఉండగా మొత్తం 20 వార్డులు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 20,170 మంది ఉన్నారు. మున్సిపాలిటీ లెక్కల ప్రకారం ప్రస్తుతం 8675 నివాస గృహాల వారు ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. ప్రసుత్తం జనాభా 40 వేలు దాటింది. ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, అన్ని వర్గాల వారు వారి అవసరాల నిమిత్తం ఇక్కడే ఉండేందుకు వస్తున్నారు. పట్టణంలో గత ప్రభుత్వం హయాంలో రూ.26 కోట్లతో చేపట్టిన ప్రధాన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు కూడా తుది దశలో ఉన్నాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తరువాత స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో మార్కెట్ రోడ్డు కూడా త్వరలో విస్తరణ కానున్నాయి.

రియల్ ఎస్టేట్ రంగంలో వృద్ధి

ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, ఇతర వర్గాల వారికి పట్టణంలోని ఆయా బ్యాంకులు గృహ నిర్మాణలకు రుణ సదుపాయం కల్పించడంతో రియల్ ఎస్టేట్ రంగం జోరుగా సాగుతోంది. పట్టణంలోని డాక్టర్స్, వీటీ కాలనీల్లో 10 ఏళ్ల క్రితం గజం ధర రూ.5 నుంచి 10 వేలలోపే పలకగా నేడు రూ.20 నుంచి 35 వేలపైనే పలుకుతోంది. పట్టణం చుట్టూ 10 నుంచి 15 పైనే లే అవుట్లు వెలిశాయి.

డ్రైయినేజీ వ్యవస్థ మెరుగుపడాలి



నకిరేకల్ పట్టణం అన్ని విధాలుగా మంచి వాతావరణం తలపించేలా అభివృద్ధి జరగాలి. పూర్తిస్థాయిలో డ్రైయినేజీ వ్యవస్థ మెరుగుపడాలి. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే వెళ్లలేని పరిస్థితి అన్ని వార్డుల్లో కనిపిస్తోంది. కొత్త ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే ముందు సెట్ బ్యాక్ అయి నిర్మాణాలు జరిగేలా చర్యలు చేపట్టాలి. పార్కులు ఏర్పాటు చేయాలి.

-కందాల పాపిరెడ్డి,ఏపీఎం విద్యాసంస్థల అధినేత

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం



పాలక వర్గం సహకారంతో ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. చుట్టుపక్కల పల్లెల నుంచి పిల్లల చదువుల కోసం నకిరేకల్‌లోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడానికి వస్తుండడంతో పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతోంది. లే అవుట్లపై కూడా దృష్టి పెట్టాం. మున్సిపాలిటీ అనుమతుల ప్రకారం లేఅవుట్లు చేసి ప్లాట్లు విక్రయించాలి.

-రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్